వైఎస్ జగన్‌తో భేటీ



రామగిరి: మండలంలోని కుంటిమద్దికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ రమేష్ శుక్రవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను వైఎస్ జగన్‌కు వివరించారు.

భవనాలున్నా నిరుపయోగం



పాత ఎంపీడీఓ కార్యాలయం



పాలశీతలీకరణ కేంద్రం

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ప్రభుత్వ పాత భవనాలు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- వినియోగంలోకి తీసుకుని రావాలని కోరుతున్న స్థానికులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పాలడెయిరీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయాలతో పాటు ఎంపీపీ క్యాంప్ కార్యాలయం నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం ఈ కార్యాలయాల్లో కార్యకలాపాలు జరిగాయి. అయితే ఈ భవనాలు పాతబడ్డాయనే కారణంతో కొత్త భవనాలను మంజూరు చేశారు. వీటిని ఖాళీ చేయడంతో పాటు వాటి నిర్వహణను గాలికొదిలేశారు. భవనాలను వినియోగించక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కాగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాత పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం కూలిపోయింది. ఈ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఓ వైపున ఉన్న గోడ పూర్తిగా ధ్వసమైంది. అలాగే పాలశీతలీకరణ కేంద్రం (పాల డెయిరీ) భవనం వృథాగా ఉండటంతో డోర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ భవనం బిచ్చగాళ్లకు నిలయంగా మారింది. అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవనాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. భవనాలకు మరమ్మతులు చేయించి ఇతర ప్రభుత్వ సేవలకు వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

మరమ్మతులు చేస్తే మేలు



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాత భవనాలకు మరమ్మతులు చేస్తే వాటిని ఉపయోగించుకోవచ్చు. వాటిని అలాగే వదిలేస్తే కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా అవుతోంది. అధికారులు వెంటనే భవనాలను పరిశీలించాలి. వీటిని ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకోవాలి.

– లింగన్న చెన్నేకొత్తపల్లి

కిశోర బాలికలకు అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ

పుట్టపర్తి అర్బన్: కిశోర బాలికలు ఆరోగ్యంపై దృష్టి సారించేలా వారికి అవగాహన కల్పించాలని ఆర్డీఓ సువర్ణ ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. స్థానిక సంస్కృతి విద్యాసంస్థల్లో రెండవ రోజు శుక్రవారం కిశోర వికాసంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మారుతున్న కాలానికి తగ్గట్లు కిశోర బాలికలు తగిన జాగ్రత్తలు తీసుకొని ఎటువంటి ఇబ్బంది పడకుండా సురక్షితంగా ఉండాలన్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా పలు కమిటీల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలోనూ కిశోర వికాసాన్ని తీసుకెళ్లే బాధ్యత ఐసీడీఎస్‌ది మాత్రమే కాదని వైద్య, విద్య, పంచాయతీ రాజ్ శాఖ తదితర శాఖలు భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ పీడీ సుధావరలక్ష్మి పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్లు మురళీధర్, నాగలక్ష్మి, డాక్టర్ నరేష్ కుమార్, ఈఓఆర్డీ నజీమా, సీడీపీఓలు శాంతలక్ష్మి, లక్ష్మి, ఎంపీడీఓలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కనగానపల్లి: కనగానపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమేష్ తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్, ఖోఖో పోటీల్లో నాని, వైష్ణవి ప్రతిభ కనబరిచారు. దీంతో వీరిద్దరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అబ్బాస్, ఉపాధ్యాయులు క్రీడాకారులతో పాటు పీడీని ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

వృత్తి విద్యపై అవగాహన



విద్యార్థినులకు కంప్యూటర్ ప్రోగ్రామ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

ఎస్పీకుంట: విద్యార్థినులు వృత్తివిద్యపై అవగాహన కలిగి ఉండాలని వృత్తివిద్యా శిక్షకురాలు అలియా అంజుమ్ పేర్కొన్నారు. స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు లెర్నెట్ స్కిల్ ఆఫ్ లైఫ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్.పీ.కుంట–2 సచివాలయంలో నైపుణ్య శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ అధికారులు విద్యార్థినులకు కంప్యూటర్ స్కిల్స్, ప్రోగ్రామ్స్‌ను వివరించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ విద్యపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా పోలీస్ లలితకుమారి విద్యార్థినులకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌పై, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల ఉపాధ్యాయిని అరుణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కందిలో మచ్చల పురుగును నివారించండి



కంది పంటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

పుట్టపర్తి అర్బన్: కంది పంటలో పూత దశలో వచ్చే మరుకా మచ్చల పురుగును నివారించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కిశోర్, డాక్టర్ శశికళ రైతులతో కలిసి కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లి, రామగిరి మండలం నసనకోట, కనగానపల్లి మండలం కోనేటినాయుని పాల్యం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కంది పంటను పరిశీలించారు. పూత దశలో ఉన్న కంది పంటకు మరుకా మచ్చల పురుగు దాడి చేసి పూతను నాశనం చేస్తాయన్నారు. నివారణకు బెజోయేట్ మందును ఎకరాకు 100 గ్రాములు, లేదా స్పైనోశాడ్ 0.3 ఎంఎల్ లేదా క్లోరాంట్రానిలిప్రోల్ ను 0.3 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

'పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి'



వ్యవసాయ శాఖపై సమీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని సభ్యులు డిమాండ్ చేశారు.శుక్రవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఏవీరమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట వ్యవసాయశాఖపై సమీక్షించారు. ఈసందర్భంగా ఏఓ వెంకటబ్రహ్మం మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనిపై సభ్యులు మండిపడ్డారు. గతంలో 5 ఏళ్ల పాటు వైఎస్ జగన్ ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించడంతోపాటు పంట నష్టపోయిన రైతులకు బీమా అందించిందని గుర్తు చేశారు. బీమా ప్రీమియంను కూటమి ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. రబీలో మండలానికి 300 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు సరఫరా చేయగా ఇప్పటి వరకూ 150 క్వింటాళ్లు మాత్రమే రైతులు కొనుగోలు చేసినట్లు ఏఓ తెలియజేశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే చేస్తున్నారని ప్రజలు సహకరించాలన్నారు. అనంతరంఏపీఓ మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తదితరులు తమ శాఖల వివరాలను సభకు తెలియజేశారు. విద్యుత్ కోతలు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీలు హనుమంతరెడ్డి, రంగన్న, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ ఇందిరబాల, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి గీతం ఆవిష్కరణ



ఓడీచెరువు: ఎం.కొత్తపల్లి బండమీద వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆలయ నిర్మాణ సంకల్పకుడు పచ్చర్ల ఆంజనేయులునాయుడు, తహసీల్దారు అనంతాచారి, అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్ సమక్షంలో అయ్యప్ప స్వామి గీతాన్ని ఆవిష్కరించారు. శ్రీధర్మశాస్త్ర ఆలయంలో మాల వేసిన తరువాత తన జీవితంలో పెనుమార్పులు సంభవించినట్లు, తమిళ సినిమాలకు పాటలు రాసే అవకాశం వచ్చినట్లు గీత రచయిత లవ్లీ లక్ష్మణ్ తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి శుక్రవారం సాయంత్రం అక్రమంగా ఇసుక తరలిస్తున్న అనంతపురానికి చెందిన రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చండి

బత్తలపల్లి: ప్రయాణీకులను వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ ఆటో డ్రైవర్లకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి తాడిమర్రి, నార్పల, అనంతపురం, ముదిగుబ్బ, ధర్మవరం తదితర మండలాలకు వివిధ మార్గాల్లో ఆటోలు నడిపే డ్రైవర్లు ప్రయాణికులను రోడ్డు నిబంధనలపై అవాగాహన కల్పించారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కదిరి అర్బన్: నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం పొందిన బాలప్పగారిపల్లి తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటరమణపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజా పోరాట సమితి నాయకులు కోరారు.

ఈమేరకు శుక్రవారం చెన్నక్రిష్ణకు వినతిపత్రం సమర్పించారు. వెంకటరమణ అసలు పేరు వెంకటరెడ్డి అని, తలుపుల మండలం మాడికవాండ్లపల్లికి చెందిన వెంకటరెడ్డి పేరు మార్చుకుని నకిలీ ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం పొందాడన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు గంగులప్ప, సురేష్, ముత్యాలమ్మ, దొడ్డెప్ప, అనిత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా అక్కులప్ప

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సీఐటీయూ ప్రజా సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్‌గా అక్కులప్ప, కమిటీ సభ్యులుగా కొండయ్య, యర్రదొడ్డి నరసింహులు,లక్ష్మీదేవి, సుజాత,ఆశా లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సబ్సిడీ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోండి

నల్లచెరువు: మండలంలోని రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ భారతి శుక్రవారం కోరారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌కు గానూ 200 క్వింటాళ్ల కె–6 రకం విత్తన వేరుశనగ మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకు రావాలని తెలిపారు. 30 కేజీల బస్తా విత్తన కాయల ధర సబ్సిడీ పోనూ రూ.1728 రైతు చెల్లించాలన్నారు. ప్రతి రైతు గరిష్టంగా మూడు బ్యాగులు తీసుకోవచ్చన్నారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలపై 25న ధర్నా

ధర్మవరం: ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్ల సమస్యలు తీర్చాలని ఈనెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నామని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో–కన్వీనర్ అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. శానిటరీ వర్కర్లకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. స్కూల్స్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి నాగవేణి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో సహస్ర దీపోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాలేవీధిలోనున్న పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం సహస్ర దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకుని దీపాలను వెలిగించి లలిత సహస్రనామ పారాయణం చేశారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నల్లచెరువు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి తెలిపారు. దేవిరెడ్డిపల్లి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్‌ను శుక్రవారం సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. పాఠశాలలో వంట స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బాబా ఫక్రుద్దీన్, పీడీ హరి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర, అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కులగణన కోసం ఉద్యమించాలి

ధర్మవరం అర్బన్: కుల గణన కోసం బీసీలు ఉద్యమించాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అంపావతిని గోవిందు డిమాండ్ చేశారు. ధర్మవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బీసీ సమన్వయ కమిటీ, బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీల కుల జనగణనపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అంపావతిని గోవిందు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కుల గణన లేకపోవడం వల్ల అన్ని రంగాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఐక్యంగా ఉద్యమిస్తేనే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం సభ్యులు జంగమన్న, వెంకటేష్, బోయరవిచంద్ర, నరసింహులు, రోషన్ జమీర్, పోలా లక్ష్మీనారాయణ, రామచంద్ర, సూరి, కళ్యాణి, లక్ష్మీనారాయణ, వీరనాగప్ప, శ్రీరాములు, నాగలయ్య, జయశంకర్ పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు

కదిరి టౌన్: ఇంటి స్థలం విషయంలో జరిగిన గొడవపై పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. వివరాలు.. పట్టణంలోని పర్వీన్‌బాను పెట్రోల్ బంకు సమీపంలో పఠాన్ ఫిరోజ్‌ఖాన్‌కు చెందిన సర్వే నంబర్ 959–4, 960–3లో రెండున్నర ఎకరాల్లో స్థలంలో బండలు పాతేందుకు యత్నించారు. అయితే పట్టణానికి చెందిన కొలిమి మహబూబ్ వలిఖాన్, యజాజ్ అలాఖాన్, నయాజ్ అలీఖాన్, ఖసీఫ్, సల్మా, ఖాదర్‌బాషా అక్రమంగా బండలు తొలగించడంతోపాటు పఠాన్ ఫిరోజ్ ఖాన్ ,బాబా ఫక్రోద్దీన్‌పై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ డీవీ నారాయణరెడ్డి తెలిపారు

కొనసాగిన సమ్మె

ముదిగుబ్బ: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.6వేలతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉందన్నారు. కార్మికులు ఆటో పెద్దన్న, అవాజ్ కమిటీ మండల కార్యదర్శి నాగప్ప, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు భోజన వసతి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు భోజన ప్యాకెట్లు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలత చేతులమీదుగా రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లును పంపిణీ చేశారు.

సత్యసాయి సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



బ్యానర్ ప్రదర్శిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పుట్టపర్తి టౌన్: భగవాన్ సత్యసాయి బాబా జయంత్యుత్సవాల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుక్రవారం సేవలందించారు. ప్రశాంతి నిలయంలో 32 మంది వలంటీర్లు ఐదు రోజులపాటు సేవలందిస్తారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విష్ణుప్రియ తెలిపారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ధర్మవరం అర్బన్: స్థానిక రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రం 4వ సెంటర్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ అరుణమ్మ(45) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. తలలో గడ్డలు ఉండటంతో ఆమెకు బెంగళూరు ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించారు. ఆపరేషన్ అనంతరం ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త నాగమల్లు, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్ మృతి చెందడం బాధాకరమని సీడీపీఓ లక్ష్మీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి చంద్రకళ సంతాపం వ్యక్తం చేశారు.

పాత్రికేయుల సమస్యలపై పోరాటం



సభ్యత్వ నమోదు పత్రాలు అందిస్తున్న దృశ్యం

తాడిమర్రి: పాత్రికేయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, ధర్మవరం డివిజన్ అధ్యక్షుడు జానిపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ చౌదరి, సహాయ కార్యదర్శి గోల్ల ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ధర్మవరం డివిజన్ ఉపాధ్యక్షుడు చందమామ వీరనారప్ప, సహాయ కార్యదర్శి ముసుగు ఆదినారాయణ, కమిటీ సభ్యులు బండారు వెంకటేష్‌తో కలసి మండల విలేకర్లతో కమిటీ సభ్యత్వ నమోదు చేశారు. యూనియన్ మండలాధ్యక్షుడు గుమ్మడం ఓబుళపతి, గౌరవాధ్యక్షుడు వీరబొమ్మ నాగరాజయ్య, ప్రధాన కార్యదర్శి అగిలే అనంతరెడ్డి, కార్యదర్శి కొంకా సాయిప్రభు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన చంద్రకళ అనారోగ్యంతో శుక్రవారం సూపర్ వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... దుర్గానగర్‌కు చెందిన అనిల్‌కుమార్ భార్య చంద్రకళ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్థాపం చెందిన చంద్రకళ వాజ్‌మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులబాధతో మరోవ్యక్తి..

పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన మల్లికార్జున అప్పులబాధతో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... కూలిపని చేసే మల్లికార్జున కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనస్థాపం చెంది ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చెన్నేకొత్తపల్లి: గర్భిణులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. తద్వారా ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనిస్తారని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పక వైద్య పరీక్షలు వేయించుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైన వెంటనే దగ్గర్లోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ల పర్యవేక్షణలో ప్రసవం జరగడం వలన తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారన్నారు.

పశు గర్భకోశ చికిత్స శిబిరం

తాడిమర్రి: ఆత్మకూరులో శుక్రవారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక పశు వైద్యులు స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ పెయ్య దూడలు మాత్రమే ఇవ్వగలిగే లింగనిర్ధారణ వీర్యం వినియోగం కోసం శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

కదిరి టౌన్: ప్రభుత్వం పేదలకిచ్చిన ఇంటి పట్టాలు తన వద్ద పెట్టుకొని డబ్బు డిమాండ్ చేసిన విషయంలో సున్నపుగుట్ట తాండాకు చెందిన సభావత్ సోమ్లానాయక్‌పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. పట్టణంలోని శివాలయం వెనుక వీధిలో నివాసం ఉన్న తాంబూరి పీరు నాయక్ అనే వ్యక్తికి 2018లో ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసింది. ఇందుకోసం వారు దళారి సోమ్లానాయక్‌కు రూ.50 వేలు ఇచ్చారు. అయితే ఇంకా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.